సాక్షి అనంతపురం

సోమవారం ı 27 ı నవంబర్ ı 2023



గర్భాలయాన్ని సంరక్షించుకుందాం

గర్భసంచి తొలగింపుతో మహిళలకు దుష్పరిణామాలు ఎదురవుతాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. 8లో



రైతును రక్షించిన పోలీసులు

పాము కాటుకు గురైన ఓ రైతును పోలీసులు సకాలంలో ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందేలా చూశారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.9°/ 20.4°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం చలి కొనసాగింది.

న్యూస్‌రీల్

నేడు సామాజిక సాధికార బస్సు యాత్ర

- హాజరుకానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు



తాడిపత్రిలో వెలిసిన సాధికార యాత్ర ఫ్లెక్సీలు

తాడిపత్రి: వైఎస్సార్‌సీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు జరిగిన న్యాయం, వారికి చేకూరిన మేలును ప్రజలకు వివరించే సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం తాడిపత్రిలో జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. పట్టణంలో ఎటు చూసినా యాత్ర ఫ్లెక్సీలు వెలిశాయి. యాత్రలో భాగంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషశ్రీచరణ్, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాల ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఇతర ఎమ్మెల్యేలు విచ్చేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు బస్సు యాత్ర వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభంకానుంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలతో ర్యాలీగా సామాజిక సాధికార బస్సు యాత్ర సీబీ రోడ్డు వెంబడి పోలీస్‌స్టేషన్ సర్కిల్ సమీపంలోని బహిరంగ సభాస్థలి వద్దకు చేరుకుంటుంది. అక్కడ సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే బహిరంగ సభలో ముఖ్య అతిథులు ప్రసంగిస్తారు. యాత్రను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



ఖాదర్‌పేటలో డ్రోన్ ప్రదర్శనను వీక్షిస్తున్న కలెక్టర్ గౌతమి తదితరులు

పామిడి: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఖాదర్‌పేటలో నిర్వహించిన పీఎం వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభకు ముఖ్య అతిథిగా కలెక్టర్‌తో పాటు ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న 17 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నదే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్‌ఓ దేవి, డీఎస్‌ఓ శోభారాణి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నాగరాజ్, సోషల్ వెల్ఫేర్ జేడీ మధుసూదన్‌రావు, డీటీడబ్ల్యూఓ అన్నాదొర, హార్టికల్చర్ డీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, డీఈఓ నాగరాజ్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి రసూల్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి మహమ్మద్ రఫీ, డీవీఓ యుగంధర్, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఏఓ లీనా వసుంధర తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక వారసత్వం కొనసాగించాలి



చిగిచెర్ల కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: జిల్లా చారిత్రక వారసత్వాన్ని కొనసాగించాలని వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పర్యాటక శాఖ, పురావస్తు శాఖ, ఇంటాక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వారసత్వ వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథులుగా హాజరైన ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి, పురావస్తు శాఖ ఏడీ రజిత, ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్ ప్రసంగించారు. జిల్లాలో ఎన్నో ప్రసిద్ధి చెందిన కోటలు, దేవాలయాలు, తరిగిపోని శిల్పసంపదతో పాటు ప్రఖ్యాతిగాంచిన ఎన్నో కళారూపాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, పద్యపఠనం, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం సాహిత్య భారతి గౌరవాధ్యక్షులు పతికి రమేష్‌నారాయణ, ఇంటాక్ ప్రతినిధులు కృష్ణమూర్తి, షరీఫ్, శ్రీనిధి రఘు, రియాజుద్దీన్, సాధుశేఖర్, శ్రీనివాసరెడ్డి, గిరిధరరాయ్, నబీరసూల్ తదితరులు ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డిని సత్కరించారు.

కోటి దీపోత్సవ వైభవం

అనంతపురం కల్చరల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం అనంతపురంలో నిర్వహించిన కోటి దీపోత్సవం వైభవంగా సాగింది. ఆర్ఎఫ్ రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా కార్యక్రమం నిర్వహించారు. విరూపాక్షేశ్వర దత్తాత్రేయ పీఠాధిపతులు విద్యానృసింహభారతి, చిన్మయ మిషన్ ఆత్మవిదానంద సరస్వతి, ఇస్కాన్ చైర్మన్ దామోదర గౌరంగదాసు, వేదపండితులు ఆలూరు లక్ష్మీ నరసింహశాస్త్రి తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్తీక దీపోత్సవ ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్తీక పౌర్ణమి నాడు నిర్వహించే కోటి దీపోత్సవం ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. అనంతరం 1008 మంది లక్ష వత్తులతో కూడిన దీపాలను వెలిగించడంతో ఒక్కసారిగా ప్రాంగణం కాంతులీనింది. కార్యక్రమంలో టీటీడీ ధర్మప్రచార మండలి ప్రతినిధి శ్రీపాద వేణు, కార్యక్రమ నిర్వాహకులు గుప్తా, ఫ్లెక్స్ రమణ, హరికిషోర్ శర్మ, గోవింద సేవా సంఘం ఆళ్లగడ్డ రాము తదితరులు పాల్గొన్నారు.



కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న వేద పండితులు, నిర్వాహకులు



సామూహిక దీపారాధన చేస్తున్న మహిళలు, ప్రజలు

క్రీడా సంబరానికి సిద్ధం

'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 663 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడలు నిర్వహించనున్నారు. దేశ చరిత్రలో ఇప్పటిదాకా ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో 20 వేల మ్యాచ్‌లు జరగనున్నాయి.

- డిసెంబర్ 15 నుంచి జనవరి 26 వరకు టోర్నీ
- జిల్లా వ్యాప్తంగా 663 సచివాలయాల పరిధిలో ఏర్పాట్లు
- క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడల నిర్వహణ
- 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి అన్ని విభాగాల సహకారం

అనంతపురం: జిల్లాలో డిసెంబర్ 15 నుంచి జనవరి 26 వరకు ఏకంగా 43 రోజుల పాటు



'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు జరగనున్నాయి. డిసెంబర్ 15 నుంచి 20 వరకు గ్రామ, వార్డు సచివాలయ స్థాయి, డిసెంబర్ 21 నుంచి జనవరి 4 వరకు మండల స్థాయి, జనవరి 5 నుంచి 10 వరకు నియోజకవర్గ స్థాయి, జనవరి 11 నుంచి 21 వరకు జిల్లా స్థాయి, జనవరి 22 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలతో పాటు అదనంగా యోగా, టెన్నికాయిట్, మారథాన్ ఈవెంట్లు నాన్ కాంపిటీటివ్ విభాగంలో నిర్వహిస్తారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో నియోజకవర్గస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.35వేలు, రూ.15వేలు, రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ పోటీ విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు అందించనున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ తృతీయ విజేతలకు వరుసగా రూ.5లక్షలు, రూ.3లక్షలు, రూ.2 లక్షలు ఇవ్వనున్నారు.



క్రీడా పరికరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి (ఫైల్)

గోదాములో క్రీడా పరికరాలు..

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు సంబంధించి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడా పరికరాలను సచివాలయాలకు పంపించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటికి సంబంధించిన శ్యాంపిల్స్‌ను కలెక్టర్ గౌతమి ఇటీవల పరిశీలించారు. జిల్లాకు రెండు రోజుల్లో పూర్తిస్థాయి పరికరాలు చేరుతాయి. ఖోఖో మెటీరియల్ పూర్తిగా వచ్చింది. వీటిని గోదాములో భద్రపరిచారు.

321 ఆటస్థలాలు సిద్ధం..

అనంతపుం జిల్లాలోని 33 మండలాల్లో మొత్తం 663 గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రా టోర్నీ నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి సచివాలయ పరిధిలో ఆటగాళ్ల పేర్లు, వివరాలు నమోదు చేయనున్నారు. మొత్తం 321 ఆటస్థలాలు సిద్ధం చేశారు. ఇందులో 241 క్రికెట్, 283 బ్యాడ్మింటన్, 297 వాలీబాల్, 307 కబడ్డీ, 289 ఖోఖో ఆటస్థలాలు సిద్ధంగా ఉన్నాయి. మొత్తం 6,630 మంది సచివాలయ వలంటీర్లు, 284 మంది ఫిజికల్ డైరెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు, ఎంఈఓలు, హెచ్ఎంలు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.

నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి సచివాలయాల పరిధిలో ఆటగాళ్ల వివరాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నాం. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మొత్తం 321 ఆటస్థలాలను సిద్ధం చేశాం. ఒక ఉద్యమంలా ఈ కార్యక్రమం చేపడుతున్నాం. క్రీడల పట్ల యువత ఆసక్తి ఏర్పరచుకునేలా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విజయవంతంగా చేపట్టాలని ఆదేశాలు అందాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– పి.నరసింహారెడ్డి, చీఫ్ కోచ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, అనంతపురం

ఎనలేని సంపద భారత రాజ్యాంగం

పామిడి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సారథ్యంలో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగం ఎనలేని సంపదతో సమానమని కలెక్టర్ గౌతమి అన్నారు. పామిడితో పాటు మండలంలోని ఖాదర్‌పేట, జీ కొట్టాల తదితర గ్రామాల్లో భారత రాజ్యాంగ నమోదు దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు ఓబులేసు, ఓబులేసు యాదవ్, చలపతి, సూరి, గోపాల్, బాలరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖాదర్‌పేటలో కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం రూపొందించి దశాబ్దాలు గడిచినా ఎక్కడ మార్పులు చేసుకోవాల్సిన అవసరం లేకుండా ఉండడం అంబేడ్కర్ గొప్పతనమేనన్నారు. ఆయన అమలు పరచిన భారత రాజ్యాంగం వల్ల మనం ప్రశాంతమైన ప్రజాస్వామ్యాన్ని నడపగలుగుతున్నామన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అనే నినాదంతో మనకిచ్చిన స్వాతంత్ర్యానికి ఏమాత్రం భంగం వాటిల్లకుండా ప్రశాంత జీవితం గడుపుతున్నామంటే అదీ ఆయన చలువేనని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత, సర్పంచ్ సుశీలమ్మ, వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ సభ్యుడు మజ్జిగ రాజశేఖర్, మాజీ సర్పంచ్ బయపరెడ్డి, అధికారులు, అనధికారులు తదితరులు పాల్గొన్నారు.



భారత రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తున్న కలెక్టర్ గౌతమి

తాడిపత్రిలో టీడీపీ గెలవదు

- టీడీపీకి రాజీనామా చేసిన మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ జిలాన్‌బాషా
- నేడు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటన

తాడిపత్రిటౌన్: వచ్చే ఎన్నికల్లో తాడిపత్రిలో టీడీపీ గెలిచే పరిస్థితి లేదని ఆ పార్టీ నేత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జిలాన్ బాషా అన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి టీడీపీని ప్రజలు అసహ్యించుకునే స్థాయికి దిగజార్చారని అన్నారు. ఆదివారం ఉదయం టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేశానన్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులుకు ఫ్యాక్స్ ద్వారా రాజీనామా లేఖను పంపానన్నారు. అనంతరం పట్టణంలోని చింతల వేంకటరమణస్వామి ఆలయ ధర్మకర్త కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి ఇంట్లో జిలాన్ బాషా మీడియాతో మాట్లాడారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లను పక్కనపెట్టి, విలువలు లేని వారితో సోషల్ మీడియా వేదికగా సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడిస్తూ టీడీపీని ప్రజల్లో చులకన చేసేశారన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన ఈ మూడేళ్లలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా సమస్యలు సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులు పెట్టడం తప్ప ఆయన చేసిందేమీ లేదన్నారు. ఈసారి ఎన్నికల్లో కార్యకర్తలు కూడా టీడీపీకి ఓటు వేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయాలు, కుల,మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. తాడిపత్రిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రశాంత, స్నేహపూర్వక వాతావరణం కల్పించారన్నారు. సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిలాన్‌బాషా

అభివృద్ధిని అడ్డుకోవడం తగదు..

తాడిపత్రి పట్టణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, తదితర అభివృద్ధి పనులను అడ్డుకోవడం జేసీ ప్రభాకర్‌రెడ్డికి తగదని చింతల వేంకటరమణస్వామి ఆలయ చైర్మన్ కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి హితవు పలికారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డికి మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో టిడ్కో ఇళ్లు, వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు ముందుకు సాగకుండా కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని, ఇది ఎంతమాత్రమూ మంచిది కాదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తాడిపత్రిలో రోడ్లు, డ్రెయినేజీ, ఆటోనగర్ తదితర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా తాడిపత్రిలో అభివృద్ధి పనులకు ఒక్క భూమి పూజ కూడా చేయలేదన్నారు. దిగజారుడు రాజకీయాలు మానుకుని, నియోజకవర్గాన్ని ప్రశాంతంగా ఉంచేలా ప్రభాకర్‌రెడ్డి ఆలోచన మారాలని ప్రజల తరఫున దేవుడిని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు అయూబ్‌బాషా, మాజీ కౌన్సిలర్ డీవీ కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు భరోసా

- ప్రతి వాహనానికీ ఇన్సూరెన్స్ తప్పనిసరి
- రోడ్డు ప్రమాద సమయంలో ఉపయోగకరం
- వాహనాలు పట్టుబడకపోయినా పరిహారం
- మృతి చెందిన వారికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు
- 'హిట్ అండ్ రన్ రోడ్ యాక్సిడెంట్–2022'ను అమల్లోకి తెచ్చిన కేంద్రం



అనంతపురం సెంట్రల్: రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని తీసుకొచ్చింది. 'హిట్ అండ్ రన్ రోడ్డు యాక్సిడెంట్-2022' ద్వారా బాధితులను ఆదుకోవాలని నిర్ణయించింది. యాక్సిడెంట్‌కు కారణమైన వాహనాలు, నిందితులు పట్టుబడకపోయినా పరిహారం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టి చనిపోతే రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేల పరిహారం కేంద్ర ప్రభుత్వం అందించనుంది.

జిల్లాలో రోడ్డు ప్రమాదాల వివరాలు			
సంవత్సరం	మొత్తం రోడ్డు ప్రమాదాలు	చనిపోయిన వారు	గాయపడిన వారు
2021	592	351	658
2022	540	331	588
2023 (ఇప్పటి వరకు)	467	305	500


ఇన్సూరెన్సు తప్పనిసరి

రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి వేదన వర్ణనాతీతం. ఏటా జిల్లాలో వందల్లో మృతి చెందుతుంటే... వేలాదిమంది క్షతగాత్రులుగా మారుతున్నారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం.. రోడ్డు నిబంధనల పాటించకపోవడం తదితర కారణాలతో ఎక్కడో ఒక చోట ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ పథకాలు తీసుకొచ్చాయి. గాయపడినా.. మృతి చెందినా ప్రమాదాలకు కారణమైన వాహనాల ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి పరిహారాన్ని క్లెయిమ్ చేసుకునే హక్కు కల్పించాయి. ఇన్సూరెన్స్ స్కీములు బాధితులకే కాకుండా వాహన యజమానులకు కూడా భరోసా కల్పిస్తున్నాయి. అందుకే ప్రతి వాహనానికీ ఇన్సూరెన్స్ తప్పనిసరి చేశారు.

ఎలా దరఖాస్తు చేసుకోవాలంటే..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన, మృతి చెందిన వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులు ఆరు నెలల్లోపు ఘటనాస్థలం పరిధిలోని తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ఆధార్ ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను జత చేసి వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేయాలి. తహసీల్దార్ పరిశీలించిన వెంటనే కలెక్టర్‌కు నివేదిస్తారు. రోడ్డు సేఫ్టీ సమావేశంలో చర్చించిన తర్వాత కలెక్టర్ ప్రొసీడింగ్స్‌ను జారీ చేస్తారు. ఢిల్లీలోని జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి పరిహారం మంజూరవుతుంది. 2022 సంవత్సరంలో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కానీ సరైన ప్రచారం, అవగాహన లేమితో జిల్లాలో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఈ స్కీము ద్వారా పరిహారం రాలేదు. అయితే దరఖాస్తు కూడా చేసుకోకపోవడం గమనార్హం.

అవగాహన కల్పిస్తున్నాం



రోడ్డు ప్రమాదాలను నివారించడమే కాకుండా దురదృష్టవశాత్తు ఘటనలో బాధితులుగా మారిన వారిని ఆదుకోవడంపై కూడా దృష్టి సారిస్తున్నాం. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'హిట్ అండ్ రన్ రోడ్డు యాక్సిడెంట్-2022' పథకం కింద వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. రెండేళ్లుగా ఈ స్కీము ఉన్నా ప్రజలకు తెలియకపోవడం బాధాకరం.

– వీర్రాజు, ఉప రవాణా కమిషనర్, అనంతపురం

భారత రాజ్యాంగం ఎంతో గొప్పది



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్దదని..ఎంతో గొప్పదని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని రాజ్యాంగం అందరికీ కల్పించిందని, దానిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆదివారం కంబదూరులో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మంత్రి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను ఒకే తాటిపై నడిపిస్తున్నది అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమేనని పేర్కొన్నారు. అంబేడ్కర్ భావజాలంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన సాగిస్తున్నారని కొనియాడారు. రాజ్యాంగం పొందుపరిచిన ప్రతి హక్కులోనూ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి కనిపిస్తుందన్నారు. కుల, మత, లింగ, జాతి, వర్గ వివక్ష లేకుండా ప్రతి పౌరునికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమ న్యాయం అందించడమే రాజ్యాంగ లక్ష్యమన్నారు. ఇంతటి విలువైన రాజ్యాంగాన్ని అందరూ పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, దళిత నాయకులు మల్లేష్, లింగమూర్తి, విల్సన్, రామస్వామి, గోపి, రాజు, కిరణ్, క్రాంతి, మల్లికార్జున, నారాయణప్ప, లోకేష్, నగేష్, గంగాధర్, కమలాకర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు జ్యోతిబా పూలే వర్ధంతి

అనంతపురం రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 28న నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

రేపు శాస్త్రవేత్తల బృందం పర్యటన

అనంతపురం అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు 12 మంది సభ్యులతో కూడిన శాస్త్రవేత్తల బృందం ఈ నెల 28న జిల్లాలో పర్యటించనుందని రైతు సాధికార సంస్థ అధికారులు తెలిపారు. బృందం సభ్యులు మంగళవారం గొల్లపల్లిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తారు. ఘన, ద్రవ జీవామృతంతో పాటు బీజామృతం తయారు చేసే విధానం గురించి సభ్యులకు ఏపీసీఎన్ఎఫ్ అధికారులు వివరిస్తారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అమలవుతున్న ఏ గ్రేడ్, ఏటీఎం వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తారు. రసాయన వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న క్షేత్రాలనూ సందర్శిస్తారు. మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశవుతారు. అనంతరం రైతు శాస్త్రవేత్తలు, యువ రైతులు, రైతు పారిశ్రామికవేత్తలు, మెంటర్‌లు, తదితర బృందాలతో సభ్యులు మాట్లాడతారు. ప్రకృతి వ్యవసాయంపై చర్చిస్తారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు మాబు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రెడ్డిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ... తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన మాబు(46), బాషా ద్విచక్ర వాహనంలో సొంత పనుల నిమిత్తం అనంతపురంకు బయలు దేరారు. బీకేఎస్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామ సమీపంలో బొమ్మలబావి దగ్గర అనంతపురం – తాడిపత్రి రహదారిపై ముందు వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేస్తూ డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మాబు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా వాహనం నడుపుతున్న బాషా హెల్మెట్ ధరించడంతో గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్తీక వెలుగులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం ఆయా ప్రాంతాల్లో వెలసిన ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కొన్ని చోట్ల గ్రామస్తులంతా కలసి కార్తీక వన భోజనాలు చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో జ్వాలాతోరణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకరించి ఊరేగించారు. ఆలయ ముఖమండపం వద్ద పూజలు నిర్వహించారు. తర్వాత జ్వాలాతోరణాన్ని వెలిగించి, స్వామివార్ల ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

– సాక్షిబృందం



కసాపురంలో జ్వాలా తోరణాన్ని వెలిగిస్తున్న దృశ్యం



పెన్నహోబిలంలో జ్వాలాదర్శనం అనంతరం శ్రీవారి హారతి చూపుతున్న ఆలయ అర్చకులు



ఉరవకొండ: గవిమఠంలో లక్ష దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



నార్పల: గంగమ్మ గుడిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు





పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, ఉరవకొండ: ఉసిరి చెట్ల కింద వనభోజనాలు చేస్తున్న భక్తులు

మాజీ ఎమ్మెల్యే జగదీష్ కన్నుమూత



జగదీష్ (ఫైల్)

గుంతకల్లు: మాజీ ఎమ్మెల్యే అరికేరి జగదీష్ (85) ఆదివారం హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీలో మంచి గుర్తింపు ఉంది. 1981 నుంచి 89 వరకు రెండుసార్లు గుంతకల్లు మున్సిపల్ చైర్మన్‌గా, 1989 నుంచి 1994 వరకు గుత్తి ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా పని చేసి ప్రజల మన్ననలు పొందారు. వివిధ కారణాల రీత్యా ఆయన రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు. జగదీష్‌కు నలుగురు సంతానం కాగా వారందరినీ వ్యాపార రంగానికే పరిమితం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3.50 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థదేహాన్ని గుంతకల్లుకు తరలించి సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అరికేరి జగదీష్ మృతికి ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి సంతాపం తెలిపారు.

బాలిక డిశ్చార్జ్

అనంతపురం మెడికల్: ఉరవకొండ ఏపీపీ కుటుంబ సభ్యుల కారణంగా గాయపడి ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను శనివారం రాత్రి వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ప్రొఫెసర్ వైద్యనాథ్ బాలికను పరీక్షించి, చిన్న పిల్లల వైద్య నిపుణులతో సంప్రదించి రావాలని బాలిక తల్లికి సూచించారు.

నూతన కమిటీ ఎంపిక

అనంతపురం టవర్‌క్లాక్: ఏపీ ఎన్జీఓ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని ఆ కార్యాలయంలో ఎన్నుకున్నారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోసపీరా, ఉపాధ్యక్షుడిగా జయచంద్ర, సంయుక్త కార్యదర్శిగా మహబూబ్ బాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

జేసీ అనుచరురాలిపై కేసు నమోదు

తాడిపత్రి: సామాజిక మాధ్యమాలు వేదికగా తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అనుచరురాలు, టీడీపీ నాయకురాలు కొంకరి కమలమ్మపై పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి దిన్నె సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. టీడీపీకి చెందిన కొంకరి కమలమ్మ ఇటీవల ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అగౌరవ పరిచేలా, పార్టీ శ్రేణులను రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేశారని చెప్పారు. ఈ వ్యాఖ్యలు పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



సమావేశంలో పాల్గొన్న పీఆర్ డిప్లొమో ఇంజనీర్ల అసోసియేషన్ సభ్యులు

అనంతపురం సిటీ: 'ప్రభుత్వం ప్రాధాన్యంగా భావిస్తున్న భవన నిర్మాణాల పూర్తి చేసే క్రమంలో కొన్ని జిల్లాల కలెక్టర్లు విపరీతమైన ఒత్తిళ్లు పెడుతున్నారు. కొందరు ఏకంగా బెదిరింపులకు దిగుతున్నారు.. ఇలాంటి వాటిని సహించేది లేదు' అని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లొమో ఇంజనీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీంద్ర హెచ్చరించారు. అవసరమైతే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతపురం వేదికగా ఏపీ పీఆర్ డిప్లొమో ఇంజనీర్ల అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేశారు. జిల్లాకు సంబంధించిన అసోసియేషన్ ప్రతినిధులు మాధవకృష్ణ, అలీమ్, విజయకృష్ణ, నూరి, భానుప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో అసోసియేషన్‌ను విస్తరించే అంశం సహా ముఖ్యంగా పది అంశాలపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన అసోసియేషన్ ప్రతినిధులు తమ సహోద్యోగులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న అనేక రకాల ఇబ్బందులను సభా దృష్టికి తెచ్చారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర ఒక్కో అంశంపై స్పందించారు. అందులో సెక్షన్ ఆఫీసర్లకు అదనపు పని భారం కేటాయించకుండా ఉండేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్ శాఖలో క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఈఎన్‌సీ పరిధిలోనే ఉంచేలా ప్రభుత్వాన్ని కోరతామన్నారు. రాష్ట్ర కార్యదర్శి రత్నప్రసాద్, ఫైనాన్స్ సెక్రటరీ మురళీకృష్ణ, ఇతర ప్రతినిధులతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి సభ్యులు హాజరయ్యారు.

గర్భాలయాన్ని సంరక్షించుకుందాం



మాట్లాడుతున్న సర్జికల్ అంకాలజిస్టు సాయిలక్ష్మి దయానా

అనంతపురం మెడికల్: ప్రస్తుత రోజుల్లో చిన్న సమస్యలకు కూడా కొందరు మహిళలు గర్భ సంచిని తొలగించుకుంటున్నారని తద్వారా భవిష్యత్తులో దుష్పరిణామాలు ఎదురయ్యే అవకాశం లేకపోలేదని, గర్భాలయాన్ని సంరక్షించుకోవాలని గైనకాలజిస్టులు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ఓ ప్రముఖ హోటల్లో 'గర్భాలయాన్ని సంరక్షిద్దాం' అనే అంశంపై నిరంతర వైద్య విద్య(సీఎంఈ) కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలోని సర్జికల్ అంకాలజిస్టు సాయిలక్ష్మి దయానా, సీనియర్, ప్రముఖ గైనకాలజిస్టులు అరుణ, కృష్ణవేణి, షంషాద్‌బేగం, సుచిత్ర, రేణుక, నిస్సీ వినూత్న సీఎంఈలో ప్రసంగించారు. వారు మాట్లాడుతూ చిన్నపాటి బ్లీడింగ్, వైట్ డిశ్చార్జ్, కడుపునొప్పి, తదితర సమస్యలకు గర్భసంచిని తొలగించుకోవడం సరికాదన్నారు. తద్వారా ఎముకలు పటుత్వం కోల్పోవడంతో పాటు ముఖం ముసలితనంగా కన్పిస్తుందన్నారు. మైల అధికంగా అవుతుంటే అది క్యాన్సర్ కారణాలు కాకపోవచ్చన్నారు. మహిళలు భయాన్ని వీడాలన్నారు. ప్రస్తుత రోజుల్లో అత్యాధునిక వైద్య సదుపాయంతో కేవలం రూ.4 వేల ఖర్చుతో మెరీనా అనే పరికరాన్ని గర్భ సంచిలోకి పంపి సమస్యలను నివారించవచ్చన్నారు. అనంతరం సీఎంఈలో ప్రసంగించిన వక్తలను గైనకాలజిస్టులు సన్మానించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

అనంతపురం క్రైం: స్థానిక నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పీవీకేకే కళాశాల సమీపంలో సాయి హేమలత (28) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాలమేరకు.... పెనుకొండకు చెందిన సాయి హేమలతను కళ్యాణ్ అనే యువకుడికి ఇచ్చి 9 నెలల క్రితం వివాహం జరిపించామన్నారు. పెళ్లి సమయంలో పెద్ద మొత్తంలో నగదు, బంగారు వరకట్నం కింద ఇచ్చామని తెలిపారు. యువతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోందని, ప్రతి నెలా ఆమెకు వచ్చే జీతంలో ఒక్క రూపాయి కూడా ఉంచకుండా కళ్యాణ్ తన ఖాతాలోకి మళ్లించుకునేవాడన్నారు. అదనపు కట్నం కోసం పలుమార్లు వేధించినట్లు పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం కళ్యాణ్ తన తల్లిదండ్రులతో కలసి ఉత్తర కర్ణాటక ప్రాంతానికి విహార యాత్రకు వెళ్లాడని, హేమలతను వెంట తీసుకెళ్లలేదన్నారు. ఈ క్రమంలో ఇంట్లో హేమలత, మరిది, వరుసకు అవ్వ అయిన ఓ వృద్ధురాలు ఉంటున్నారని, ఏం జరిగిందో తెలీదని ఆదివారం సాయంత్రం హేమలత ఫ్యాన్‌కు ఉరితాడుతో చనిపోయి కనిపించిందన్నారు. వరకట్నం వేధింపులే తమ బిడ్డ చావుకు కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోటాపోటీగా రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

అనంతపురం: అనంతపురం నగరంలోని కేఎస్ఎన్ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో రాష్ట్రస్థాయి స్కూల్ ర్యాంకింగ్ చెస్ పోటీలను ఆదివారం పోటాపోటీగా జరిగాయి. అనంతపురం జిల్లా చెస్ అసోసియేషన్, ఏ1 చెస్ అకాడమీ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించగా ఆయా జిల్లాల నుంచి 185 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతి కేటగిరిలోనూ టాప్–2 క్రీడాకారులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య, హైకోర్టు అడ్వకేట్ దీపక్ దయానంద్, ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం చెస్ అసోసియేషన్ చైర్మన్ బాలరాజు, అధ్యక్షుడు శివ కుమార్, కార్యదర్శి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

రైతును రక్షించిన పోలీసులు

- అభినందించిన జిల్లా ఎస్పీ

అనంతపురం క్రైం: పాము కాటుకు గురైన ఓ రైతును అనంతపురం పోలీస్ బాంబు స్క్వాడ్ టీమ్ సిబ్బంది సకాలంలో రక్షించి ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందేలా దోహదపడ్డారు. ఆదివారం కంబదూరు మండలం అచ్చంపల్లిలో స్త్రీ శిశు సంక్షేమశాఖా మంత్రి ఉషశ్రీ చరణ్ పర్యటన ఉండటంతో జిల్లా ఏఆర్ విభాగంలోని బాంబు స్క్వాడ్ సిబ్బంది మహబూబ్ బాషా, హోంగార్డులు శ్రీనివాసులు, తిమ్మరాజులు విధులకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లి వద్ద పాము కాటుకు గురైన రైతు నరసింహులు బంధువులు, భార్య, పిల్లలు రోడ్డుపైకి వచ్చి వాహనాన్ని ఆపి పాము కాటు వేసిన విషయం తెలియజేశారు. వెంటనే స్పందించి రైతు నరసింహులును కంబదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాహనంలో తీసికెళ్లి ప్రథమ చికిత్స అనంతరం కళ్యాణదుర్గం ఆస్పత్రికి 108 వాహనంలో తరలించి సకాలంలో చికిత్స అందేలా సహాయం చేశారు. బాంబ్ స్క్వాడ్ బృందాన్ని ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

జనవాక్కు

సొంతింటి కలనెరవేరింది



సీఎం వైఎస్ జగన్ పాలనలో నా సొంతింటి కల నెరవేరింది. నా భార్య శ్రావణి పేరుపై ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణం మంజూరు చేశారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం వేగంగా సాగుతుంది. సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. – లింగంశెట్టి సునీల్, వజ్రకరూరు


ఊళ్లోనే సర్టిఫికెట్లు ఇచ్చారు



గతంలో మాకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం మండల కేంద్రంలోని ఆఫీసుకు పోయి సాయంత్రం వరకూ పడిగాపులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మాకు ఏమి అవసరమైనా వలంటీర్ ద్వారా సచివాలయానికి దరఖాస్తు చేసుకుంటే ఊళ్లోనే పనులు పూర్తవుతున్నాయి. ఈ మధ్యలో ఊళ్లో పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నాకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. ఇందు కోసం ఒక్క పైసా కూడా ఖర్చు కాలేదు. సీఎం జగన్ పాలన చాలా బాగుంది.

– హనుమక్క, కొత్తూరు, కళ్యాణదుర్గం మండలం

సిఫార్సు లేకుండానే పథకాలు



ఏ ఒక్కరి సిఫార్సు లేకుండానే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పాలన గొప్పగా ఉంది. పేదలకు ఆయన చేస్తున్న మేలు గతంలో మరెవరూ చేయలేదు. నాకు ప్రతి నెలా ఒకటవ తేదీనే వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ సొమ్మును ఇస్తున్నారు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేశారు. జగన్ పాలనలో సొంతింటి కలనెరవేరింది. ఈరాష్ట్రానికి మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా వైఎస్.జగనే ఉండాలి. – గిన్నె సరస్వతి, వజ్రకరూరు

భరోసా దక్కింది



మాకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. ఆరు ఎకరాల పొలంలో నా భర్త హంపయ్యతో కలసి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకున్నాం. నలుగురు పిల్లలకూ పెళ్లిళ్లు చేశాం. ఉన్న ఇద్దరు కొడుకులకు తలా మూడు ఎకరాల చొప్పున పంచించ్చి వాళ్ల దగ్గరే ఉండేవాళ్లం. రానురాను కుటుంబం పెద్దదవడంతో వారికి భారం కాకూడదని 15 ఏళ్ల క్రితం నా భర్త, నేను వేరు కాపురం పెట్టి ఆయన గొర్రెల కాపరిగా, నేను వ్యవసాయ కూలి పనులు చేస్తూ బతికాం. వయసు మీద పడి కాళ్ల నొప్పులతో నా భర్త నడవలేక ఇంటికే పరిమితమయ్యాడు. బతికేదెట్లా అని బాధపడుతున్న సమయంలో వలంటీర్ వచ్చి వైఎస్సార్ చేయూత పథకానికి అర్హత ఉందని చెప్పి వివరాలు తీసుకెళ్లి లబ్ధి చేకూరేలా చేశాడు. సీఎం వైఎస్ జగన్ చలువతో అందిన రూ.18,750తో ఓ చిన్నపాటి దుకాణం పెట్టుకున్నాం. వ్యాపారం బాగా జరిగి ఇప్పుడు కాస్త పెద్దగా ఏర్పాటు చేసుకున్నాం. దీంతో మా బతుకుకు భరోసా దక్కింది. అంతేకాక ఫ్యామిలీ డాక్టర్ అంటూ డాక్టర్లు ఇంటి వద్దకే వచ్చి చికిత్స చేస్తున్నారు. మందులూ ఉచితంగా ఇస్తున్నారు. మా జీవితం అంతా అయిపోయిందనుకుంటున్న తరుణంలో సంతోషంగా కాలం గడుపుతున్నామంటే అదంతా వైఎస్ జగన్ చలువే.

– రామాంజినమ్మ, నెలగొండ, గుంతకల్లు మండలం

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్ రెడ్డి కోరారు. ఆదివారం వైఎస్సార్‌టీఎఫ్ అనంతపురం జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్. నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పి. అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ రిపోర్టును వెంటనే తెప్పించుకొని పీఆర్సీ అమలు చేయాలని కోరారు. లేకపోతే 20 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి మాట్లాడుతూ ఏపీజీఎల్ఐసీ ఆన్‌లైన్ వెంటనే ఓపెన్ చేయాలన్నారు. పూర్తయిన బాండ్లకు సెటిల్‌మెంట్ చేయాలని కోరారు. జెడ్పీ పీఎఫ్ లోన్ల బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశంలో ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కంబగిరి రాముడు, రాష్ట్ర నాయకులు గోవిందరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, గంగాధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, జిల్లా ట్రెజరర్ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కొలంబస్ బాబు, చెన్నారెడ్డి, గోపాల్, రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, ఓబిరెడ్డి, విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం టవర్‌క్లాక్: నగరంలోని విజయనగర లా కళాశాలలో ఆదివారం జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి అనంతపురం విచ్చేశారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద న్యాయమూర్తికి కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో కలెక్టర్‌తో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి, మహిళా కోర్టు న్యాయమూర్తి శోభ, సీనియర్ సివిల్ జడ్జి దీనా, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు రామిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు, జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

రాజ్యాంగబద్ధంగా పనిచేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది

అనంతపురం అర్బన్: రాజ్యాంగం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అందరూ పనిచేయాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.శ్రీధర్ సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ విలువలను కాపాడతామని, రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వర్తిస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, స్పందన ఇన్‌చార్జ్ మారుతి, కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ పుణ్యవతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట



గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం కనగానపల్లిలో ఆదివారం నూతన గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ చైర్ పర్సన్ ఉమాదేవితో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.40 లక్షల నిధులతో నిర్మించిన ఈ భవనం ద్వారా గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు అనుబంధంగా ఉన్న గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో కూడా అక్షరాస్యత శాతాన్ని పెంపొందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమాదేవి, ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్, గ్రంథాలయాధికారులు గోవిందు, కిష్టయ్య, చంద్రా, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

రామగిరి: మండలంలోని పెనుబోలు గ్రామంలో కురుబ నారాయణమ్మ అలియాస్ దేవరమ్మ (55) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోసి నాగార్జున, సర్పంచ్‌లు నరేంద్ర, చెన్నకేశవరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, నరసింహాగౌడ్, కేశవరెడ్డి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అనంతపురం ఎడ్యుకేషన్: వారంతా 1976లో పదో తరగతి పూర్తి చేశారు. అంటే ఇప్పటికి 47 ఏళ్లు. వారిలో ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నవారందరూ రిటైర్డ్ కూడా అయ్యారు. ఇన్నేళ్ల తర్వాత అందరూ ఒక వేదికపైకి వచ్చారు. ఆదివారం తాము చదువుకున్న అనంతపురం నగరంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. స్టూడియో అధినేత కృపాకర్, టెలికాం రిటైర్డ్ ఇంజనీర్ వెంకటేష్ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రిటైర్డ్ డీఈఓ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నీలకంఠ, రిటైర్డ్ జర్నలిస్ట్ జి.ఆనందవర్ధన్, ప్రకాష్, రిటైర్డ్ ఏఎస్ఐ నారాయణస్వామి, రిటైర్డ్ టెలికాం ఇంజనీర్ మహబూబ్ బాషా, రిటైర్డ్ మిల్ట్రీ ఆఫీసర్స్ కుమారస్వామి, చంద్రశేఖర్, మురళి, ఉమామహేశ్వర్, ఎలిజబెత్ రాణి, విశ్వనాథ్ తదితరులున్నారు.



కాల సర్పదోష నివారణ, రాహుకేతు హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం



గర్భగుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



సామూహిక దీపార్చన చేస్తున్న భక్తులు



బాలయోగి ఆశ్రమంలో పూజలందుకున్న అనంతేశ్వరుడు

భక్తులతో పోటెత్తిన పంపనూరు

- మార్మోగిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నామస్మరణ

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దాదాపు కిలో మీటరు మేర రోడ్డుకిరువైపులా వాహనాలు బారులుతీరాయి. హోటళ్లు కళకళలాడాయి. ఆలయంలో అర్చకులు విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సర్పదోష, కాల సర్పదోష నివారణకు సర్పభూషణ రుద్ర సహిత సర్ప శాంతి హోమం చేపట్టారు. పూర్ణాహుతి అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. మంజునాథునికి రుద్రాభిషేకం, పార్వతి దేవికి అభిషేకం చేశారు. ఆలయంలో మహిళలు నిమ్మదొప్పలలో కార్తీక దీపాలు భక్తిశ్రద్ధలతో వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు అనంతపురం నుంచి పంపనూరుకు ప్రత్యేక బస్సులు నడిపారు.

పార్కులో సందడి


స్వామి దర్శనం అనంతరం పంపనూరు సమీపంలోని సిటీ పార్కుకు భక్తులు వచ్చారు. ఆనందంగా పార్కులో గడిపారు. దీంతో పార్కులో సందడి నెలకొంది.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

'పంపనూరులో పార్కింగ్ అవస్థలు' శీర్షికన ఈ నెల 20న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. భక్తులు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు నలుగురు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

కార్తీక దీపం.. దేదీప్యమానం

అనంతపురం కల్చరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి నగరంలోని ఆలయాలు దేదీప్యమానంగా మారాయి. మొదటిరోడ్డులోని శ్రీ కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం, పాతూరులోని విరూపాక్షేశ్వరాలయం, అరవిందనగర్‌లోని సర్వేశ్వరాలయం, శివకోటి, శ్రీ శివబాలయోగి ఆశ్రమం, వాసవీ కన్యకా పరమేశ్వరి తదితర ఆలయాలకు మహిళలు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.



శివకోటిలో పూజలు చేస్తున్న స్వామీజీ



ఎస్కేయూ రోడ్డు సమీపంలో మహాశివుడికి పూజలు చేసిన దృశ్యం

అభివృద్ధి చేసి చూపించాం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: గత ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని తోపుదుర్తి గ్రామంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి లబ్ధిదారులకు ఇంటి పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలతో పాటు ఇళ్లను కూడా మంజూరు చేయిస్తున్నామని తెలిపారు. నిర్లక్ష్యం చూపకుండా వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూరుస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను ప్రజలే గమనించాలన్నారు. త్వరలోనే రూ.250 కోట్లతో తోపుదుర్తి రిజర్వాయర్ భూ సేకరణ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రైతులకు ఉచితంగా బోర్లు వేయించి, పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చామని గుర్తు చేశారు. అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల్లో శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారానికి రూ.90 కోట్లతో చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. టీడీపీ అధినేత చంద్రబాబు అలవిగాని హామీలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రుణమాఫీ, పసుపు, కుంకుమ అంటూ కుచ్చుటోపీ పెట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్, ఎంపీటీసీ పోతులయ్య, సర్పంచ్ ఓబులేష్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బాల పోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ రఘునాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి, మండల ఇంజనీర్ పార్థసారథి, ఏఓ సుచరిత, వైఎస్సార్‌సీపీ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

వచ్చే ఎన్నికల్లో 25 వేలకు పైగా మెజార్టీతో గెలుస్తాం

ఆత్మకూరు (రాప్తాడు): వచ్చే ఎన్నికల్లో రాప్తాడు నియోజకవర్గంలో 25 వేలకు పైగా మెజార్టీతో గెలుస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రాప్తాడు మండలంలోని పాలచెర్ల గ్రామంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులు, నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ పథకాలు అందాయా ? లేదా? అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాలచెర్ల గ్రామంలో ప్రతి ఇంటికీ రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకూ వివిధ పథకాల ద్వారా లబ్ధి కలిగిందని తెలిపారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాతనే భోగినేపల్లి ఆయకట్టుకు హంద్రీ నీవా నీళ్లు వచ్చాయన్నారు. భూగర్భ జలాలు పెరిగి పేరూరు ఆయకట్టు కింద బీడుగా ఉన్న 3,700 ఎకరాల భూములు సస్యశ్యామలమయ్యాయని తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మండలంలోని భోగినేపల్లి గ్రామంలో కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ శేఖర్, జెడ్పీటీసీ హేమలత, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్తిరెడ్డి, సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మిదేవి, నాయకులు నరేంద్రరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, బండి శ్రీనివాసులు, బిల్లే అభిలాష్, ఓబిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలు సృష్టిస్తున్న బీజేపీ

- నగరంలో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు
- డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వివిధ మతాల పండుగలను ప్రజలందరూ సోదరభావంతో జరుపుకుని సంతోషంగా ఉన్న తరుణంలో బీజేపీ నాయకులు కుల, మతాల మధ్య విద్వేషాలు సృష్టించేలా వ్యవహరిస్తున్నారని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నగరపాలక సంస్థలోని తన చాంబర్‌లో డిప్యూటీ మేయర్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ అధికారం కోసం ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. నగరంలో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు పనులు చేస్తుంటే 'టిప్పు సుల్తాన్ దేశ ద్రోహి' అంటూ బీజేపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. వారు ఒకసారి చరిత్ర తెలుసుకోవాలని హితవు పలికారు. టిప్పు సుల్తాన్, ఝాన్సీ లక్ష్మీబాయి స్వాతంత్య్రం కోసం పోరాడి అసువులు బాసారని చరిత్ర చెబుతోందని గుర్తు చేశారు. రాజ్యాంగం పట్ల గౌరవం లేని విధంగా బీజేపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరును తప్పు పట్టారు. జాతిపిత మహాత్మా గాంధీని హత్య చేసిన గాడ్సేకి దేవాలయం కట్టిన మీరు.. ఇక రాజ్యాంగాన్ని ఏ విధంగా గౌరవిస్తారంటూ నిలదీశారు. నగరంలోని అమ్మవారిశాల నిర్వాహకులు పన్ను చెల్లించలేదని తలుపులకు అధికారులు తాళాలు వేస్తే తాను వెళ్లి తెరిపించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆనాడు బీజేపీ నాయకులు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. నగరంలో టిప్పు సుల్తాన్ విగ్రహ ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న కోగటం విజయభాస్కర్‌రెడ్డి

ఉత్సాహంగా క్విజ్ పోటీలు



ప్రశంసా పత్రాలను అందుకున్న యువతీ యువకులు

అనంతపురం కల్చరల్: యువజన సంక్షేమ శాఖ, నెహ్రూ యువకేంద్రం, ప్రగతి పథం సంయుక్త ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన వక్తృత్వ, క్విజ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక ఎన్‌వైకే సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ పోటీలకు డిప్యూటీ తహసీల్దార్ గోపీనాథ్, ఎన్‌వైకే డీడీవో శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాతి భరత్, జయమారుతి, బ్యాంక్ డైరెక్టర్ రమేష్ తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యతను యువత తీసుకోవాలని వారు సూచించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని రచించిన జాతీయ నాయకులకు రుణపడి ఉండాలన్నారు. అనంతరం 'రాజ్యాంగ విలువలు –ప్రాథమిక అంశాలు'పై నిర్వహించిన వక్తృత్వ, క్విజ్ పోటీలలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందించారు.

భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత తదితరులు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం, కమిషనర్ భాగ్యలక్ష్మి తదితరులు

అనంతపురం కార్పొరేషన్/సిటీ/ఎడ్యుకేషన్: భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని మేయర్ వసీం అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ ప్రజలకు హక్కులు, స్వేచ్ఛా సమానత్వం రాజ్యాంగం వల్లే సిద్ధించాయన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజ్యాంగబద్ధంగా ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఈఈ సూర్యనారాయణ, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, ఇషాక్, కమల్‌భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని వివిధ సచివాలయాల పరిధిలో ఆదివారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సచివాలయ సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 17వ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నవ భారత నిర్మాత అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరా, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ, అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సామాజిక న్యాయం అమలవుతోందని గిరిజమ్మ అన్నారు.
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం రాజీవ్ కాలనీ పంచాయతీ మహదేవనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్ వైజర్ జయశ్రీ హాజరయ్యారు. పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం: స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అందించి భారతీయుల ఐక్యతా స్ఫూర్తికి కొలమానంగా భారత రాజ్యాంగం నిలిచిందని అనంతపురం ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎం.రంగస్వామి అన్నారు. ఎస్కేయూలోని రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఇంఫ్లూయెన్స్ సెమినార్ హాలులో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.చంద్రమౌళి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రంగస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలోని 60 దేశాల రాజ్యాంగాలను పరిశోధించి భారతీయులకు ఒక మహత్తరమైన రాజ్యాంగాన్ని అందించారని, అందువల్లే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగ నిర్మాత అయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో సెరికల్చర్ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీ విజయనగర న్యాయ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి ఓంకార్ అధ్యక్షత వహించారు. జిల్లా వినియోగదారుల న్యాయస్థానం అధ్యక్షురాలు ఎం. శ్రీలత, మేజిస్ట్రేట్‌లు శ్రీనివాస రెడ్డి (రాజమండ్రి), దిలీప్ నాయక్ (మేడ్చల్), మమతా రెడ్డి (నాగర్ కర్నూలు, తెలంగాణ), పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రావణ్ కుమార్ (ఒంగోలు), అనంతపురం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.
- రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ సీఈఓ లలితా బాయి, పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రసూల్ తదితరులు నివాళులర్పించారు. జెడ్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షేక్ మర్తాడు రఫీ, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

ఆత్మకూరు: అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎంపీపీ హేమలత పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆమె నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, పెద్ద కొండారెడ్డి, నాగరాజు, శ్రీరామ్, వెంకట్రామిరెడ్డి, ఈశ్వరరెడ్డి, అంజనేయులు, నరేంద్ర, ఎర్రిస్వామి తదితరులున్నారు.



మహదేవనగర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుతాం

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఎటువంటి చర్యలు తీసుకున్నా తాము వ్యతిరేకంగా పోరాటం చేస్తామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ఏ చర్యలూ తీసుకోకూడదన్నారు. ఎస్సీలను ఐక్యతగానే ఉంచాలని సూచించారు. ఆదివారం నగరంలోని ఎన్జీఓ హోమ్ పెన్షనర్స్ భవన్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఓట్లు రాబట్టేందుకు ఎస్సీ వర్గీకరణకు ఒక కమిటీ వేస్తున్నట్లు ప్రకటిస్తోందన్నారు. ఇది మోసపూరితమైన ప్రకటన అని, రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి చర్యలకు పాల్పడితే మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతంగా చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, ఓబులేసు, శ్రీనివాసులు, గద్దం ముత్యాలప్ప, రాముడు, మల్లేష్, నీలం సురేష్, గోపాల్, శివలింగమూర్తి, హనుమంతరాయుడు, రాంబాబు, ఈశ్వరయ్య, ఓబులరాజు, నిర్మల, సూర్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

అనంతపురం అర్బన్: అనారోగ్యంతో చనిపోయిన చిన్మయనగర్ ఆటో డ్రైవర్ రాము కుటుంబానికి భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం అండగా నిలిచింది. సంఘం అధ్యక్షుడు షేక్ ఆజం బాషా, చిన్మయనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్లు రూ.12వేలు ఆర్థికసాయాన్ని రాము కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బేరర్స్ శీనా, చంద్రమౌళి, ఆటో స్టాండ్ నాయకులు చిరంజీవి, రామాంజినేయులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెడ్ల కార్తీక వన భోజనాలు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని కనుమ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం రెడ్ల కార్తీక వన భోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రెడ్డి సంఘం నాయకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు వేద పండితులతో కార్తీక దామోదర హోమం నిర్వహించిన అనంతరం అన్నదానం ఉంటుందన్నారు. రెడ్డి కులస్తులు కుటుంబ సభ్యులతో కలిసి తరలి రావాలని కోరారు.

కృష్ణమూర్తికి కళామిత్ర పురస్కారం

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన మహాబోధి సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దానెన్నగారి కృష్ణమూర్తి కళామిత్ర పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం ఒంగోలు నగరంలో జరిగిన కళామిత్ర మండలి రాష్ట్ర స్థాయి వేడుకల్లో ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర, డాక్టర్ పీవీ పూర్ణచంద్ర, నిర్వాహకులు డాక్టర్ నూనె అంకమరావు, తేళ్ల అరుణ చేతుల మీదుగా పురస్కారం స్వీకరించారు. అనంత వేదికగా మహాబోధి కృష్ణమూర్తి చేస్తున్న సాహితీ సేవా కార్యక్రమాలను అభినందించారు.

10న సున్నీ ఇజ్‌తెమా

అనంతపురం కల్చరల్: కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో డిసెంబర్ పదో తేదీన తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారూక్ ఆధ్వర్యంలో 14వ సున్నీ ఇజ్‌తెమా నిర్వహించనున్నట్లు మేయర్ వసీం తెలిపారు. ఇజ్‌తెమా పోస్టర్లను ఆదివారం రెండో రోడ్డులోని మస్జిదే బాహువద్దీన్‌లో ఆవిష్కరించారు. తెహరిక్ అధ్యక్షులు హజరత్ హసన్ రజాఖాద్రీ మాట్లాడుతూ వేడుకల్లో భోపాల్ నుంచి సయ్యద్ అబ్దుల్ హబీబ్ సాహెబ్, కర్ణాటక నుంచి రజాఖాన్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. మైనార్టీ నాయకులు సైఫుల్లా బేగ్, కార్పొరేటర్ ఇసాక్, మసీదు ముతవల్లి ఫరీదుద్దీన్, సెక్రటరీ పర్వేష్, షబ్బీర్ అహ్మద్, అబ్దుల్ షమీ, చాంద్‌బాషా ఉన్నారు.